

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

గురువారం,29 జనవరి 2026 | 8 పేజీలు


## అనుమతి లేదు..
# అంతా 'అక్రమ' సంజీవని !





Government of Andhra Pradesh
Health Medical and Family Welfare Department
District Registering Authority
Certificate of Temporary Registration of Allopathic Private Medical Care Establishments
(Valid for 90 days from the date of issue)

1. Application No. and Date: [illegible]
2. File number of Registration Authority: [illegible]
3. Date of issue: 20-06-2024
4. Valid till: 19-09-2024
5. This is to Certify that M/s SANJEEVANI NEURO CLINIC located at [illegible], FIRST FLOOR, MADHAVA NAGAR, KAKINADA-533003 is hereby registered temporarily under the provisions of A.P. Allopathic Private Medical Care Establishments (Registration and Regulation) Act, 2002, to provide following medical care services:

1. Category-03
2. Poly Clinics (Group Practitioners), General Medicine (Medical care), Neurology and Neuro-surgery

10. The establishment shall not rent, lend, sell, transfer or otherwise close down the registered Medical Care Establishment without obtaining prior permission of the regulatory authority.

Signature and Designation of [illegible]
District Registering Authority
A.P.M.C.E. Authority
Kakinada Dist.

Date: 20-06-2024
Place: Kakinada

సంజీవని న్యూరో క్లినిక్... అనుమతి ముగిసినా..
డాక్టర్ హరిప్రసాద్ అక్రమ దందాకు నిలువెత్తు సాక్ష్యం!

సెప్టెంబర్ 2024తోనే తాత్కాలిక లైసెన్స్ ముగిసినా, గడిచిన 16నెలలుగా సంజీవని న్యూరో క్లినిక్ ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా నడుస్తోంది.

- పి.సి.డి మాయాజాలం: కమీషన్ల కక్కుర్తితో కేవలం తమ షాపులో మాత్రమే దొరికే 'ప్రొపగాండా' మందులను అంటగడుతూ.. బయట దొరకని కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.
- బిల్లు లేని దోపిడీ: వేల రూపాయల విక్రయాలు చేస్తున్నా ఒక్క రూపాయి జీఎస్టీ బిల్లు ఇవ్వకుండా, పన్ను ఎగవేస్తూ బహిరంగంగా దోపిడీకి పాల్పడుతున్నారు.
- తక్షణమే సీజ్ చేయాలి: చట్టబద్ధత లేని ఈ క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేయాలని, లేని పక్షంలో సామాన్యుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.- బిఎన్ఎస్ కింద క్రిమినల్ చర్యలు: మోసగిస్తున్న డాక్టర్‌పై కొత్త చట్టం భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 318(4) మరియు 125 కింద కేసులు నమోదు చేయాలి.
- అధికారుల మౌనం: 16 నెలలుగా అక్రమ వైద్యం సాగుతున్నా జిల్లా ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోల్ విభాగం పట్టించుకోకపోవడం వెనుక ఉన్న మతలబు ఏంటి?

- మిగతా 2 లో..

- గడువు ముగిసి 16 నెలలైనా ఆగని వైద్యం..
- మందుల పేరిట పేదల రక్తం తాగుతున్న వైనం!
- బయట దొరకని మందులతోనే అసలు దందా..
- డాక్టర్ కమీషన్ల కోసం రోగులు బలి!

లైసెన్స్ లేదు - వైద్యం ఆగదు

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :






## రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- కోటి 78 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



రామచంద్రపురం,మేజర్‌న్యూస్ : రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. కాజులూరు మండలంలో కోటి 32 లక్షల రూపాయలతో 9అభివృద్ధి పనులు, అలాగే రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెం, నెలపర్తి పాడు గ్రామాల్లో 46 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కాజులూరు మండలంలోని శలపాకలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిమిత్తం 36 లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం కోసం 6 సెంట్లు స్థలం దానం చేసిన చంద్రు శ్రీహరి రావును పలువురు అభినందించారు. అలాగే తర్లంపూడి గ్రామంలో సిసి రోడ్డు 24 లక్షలు, టీ మామిడాడలో రోడ్డు 4 లక్షలు,

- తరువాయి 2లో..

# కాకినాడ గుండెల్లో కోరమండల్ కుంపటి

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఖబడ్దార్ !





- లాభాల వేటలో ప్రాణాల బలి: కోరమండల్ యాజమాన్యంపై ఆర్‌సీపీఐ ఆగ్రహం!
- ఎన్నూర్ పునరావృతమైతే కాకినాడ గతేంటి? టెక్నికల్ ఆడిట్ జరపాలని పట్టుబట్టిన రంబాల సతీష్!
- విస్తరణ వద్దు - రక్షణ ముద్దు: నూతన ప్లాంట్ల నిలుపుదలపై ప్రజా నిరసన వెల్లువ!
- పర్యవేక్షణలో ప్రభుత్వ శాఖల వైఫల్యం.. అధికారుల కళ్లు గప్పి 'బఫర్ జోన్'లో అక్రమ నిర్మాణాలు!
- గాలిలో విషం.. నీటిలో కాలుష్యం: పర్యావరణ ముప్పుపై నిపుణుల ఆందోళన!
- వైద్యం మాట దేవుడెరుగు.. కనీసం నెట్‌వర్క్ ఆసుపత్రులు లేని వైనం!

- మిగతా 2 లో..

గాలిలో విషం, గొంతులో భయం.. కాకినాడ కౌంట్‌డౌన్ మొదలైన వేళ, కోరమండల్ మృత్యుక్రీడపై ఆర్‌సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ హోరెత్తింది. చట్టాలు చుట్టాలై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంటే, ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నయాజమాన్య నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కార్మికులు,పర్యావరణ ప్రేమికులు కదంతొక్కారు. ఎన్నూర్ విషాదం హెచ్చరిస్తున్నా,లాభాల కోసం గ్రీన్ బెల్ట్‌ను మాయం చేస్తూ కొత్త ప్లాంట్ల విస్తరణకు పూనుకోవడం ప్రాణసంకటంగా మారింది. "వైద్యం లేదు.. రక్షణ లేదు..జనాల ప్రాణాలకు గ్యారెంటీ ఎక్కడ?" అని రంబాల సతీష్ వ్యవస్థను నిలదీశారు. తక్షణమే సాంకేతిక దర్యాప్తు జరిపి విస్తరణను నిలిపివేయకపోతే పోరాటం ఉప్పెనలా మారుతుందని హెచ్చరిస్తూ జిల్లా యంత్రాంగానికి వినతిపత్రం సమర్పించారు.

కాకినాడ, సూర్య ప్రత్యేక ప్రతినిధి :

# కాకినాడ గుండెల్లో కోరమండల్ కుంపటి

**కాకినాడ, సూర్య ప్రత్యేక ప్రతినిధి :** కాకినాడ నడిబొడ్డున ఉన్న కోరమండల్ ఇంటర్నేషనల్ పరిశ్రమలో భద్రతా లోపాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని, లాభాల వేటలో యాజమాన్యం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ ఆరోపించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో ఆయన మాట్లాడుతూ, కోరమండల్ నూతన ప్లాంట్ విస్తరణను తక్షణమే నిలిపివేయాలని, పారిశ్రామిక భద్రతపై నిష్పాక్షిక సాంకేతిక దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

**ఎన్నూర్ చేదు అనుభవం.. కాకినాడకు హెచ్చరిక!**

2023లో తమిళనాడులోని ఎన్నూర్‌లో ఇదే కోరమండల్ ప్లాంట్‌లో జరిగిన అమ్మోనియా గ్యాస్ లీకేజీ ఉదంతాన్ని సతీష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ఎన్నూర్ ప్రమాదం కేవలం పైపు పగలడం కాదు, అది యాజమాన్యం యొక్క నేరపూరిత నిర్లక్ష్యం. కాకినాడలో కూడా అటువంటి పరిస్థితి తలెత్తితే వేలాది మంది ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనా?" అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రస్తుత ప్లాంట్లలోనే భద్రతను గాలికొదిలేసిన యాజమాన్యం, కొత్త ప్లాంట్ల నిర్మాణానికి పూనుకోవడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

**అధికారుల పర్యవేక్షణ లోపం – అక్రమ నిర్మాణాలు**

పరిశ్రమల పర్యవేక్షణలో ప్రభుత్వ శాఖలు ఘోరంగా వైఫల్యం చెందాయని ధర్నాలో నేతలు విమర్శించారు.

– బఫర్ జోన్ మాయం: ఏపీఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు.

– పర్యావరణ విధ్వంసం: గ్రీన్ బెల్ట్‌ను ధ్వంసం చేయడం వల్ల ఆమ్ల వర్షాలు, భూగర్భ జలాల కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

– వైద్య వైఫల్యం: ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్స అందించేలా పల్మనాలజీ, టాక్సికాలజీ విభాగాలున్న ఆసుపత్రులతో యాజమాన్యం ఒప్పందాలు చేసుకోలేదని ఎత్తి చూపారు.

**ప్రజా పోరాటమే శరణ్యం**

"అభివృద్ధి మాటున విధ్వంసం జరుగుతోంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ప్రజల గొంతు ఊపిరికి భయం పుట్టిస్తున్నారు" అని సతీష్ మండిపడ్డారు. చట్టాలు పటిష్టంగా అమలు అయ్యే వరకు, కాకినాడ పౌరుల ప్రాణాలకు గ్యారెంటీ లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం డి.ఆర్.ఓ వెంకటేశ్వరరావును కలిసి సమగ్ర సాంకేతిక దర్యాప్తు కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ, ప్రతినిధి కృష్ణమోహన్, యూనియన్ నాయకులు బి. సూరిబాబు, శ్రీనివాస రామదాసు, వి.రమణ, పార్టీ సభ్యులు మంగా, వరలక్ష్మి మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు, మహిళలు, ప్రజలు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

# అనుమతి లేదు.. అంతా 'అక్రమ' సంజీవని!










**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**
వైద్యం అంటే ప్రాణం పోయడం..కానీ ఇక్కడ మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి జేబులు నింపుకుంటున్నారు. కాకినాడ మాధవ నగర్‌లోని 'సంజీవని న్యూరో క్లినిక్' అక్రమాల పుట్ట ఒక్కొక్కటిగాబట్టబయలవుతోంది.సూర్య ఇన్వెస్టిగేషన్‌లో తేలిన నిజాలు చూస్తుంటే,అసలు అక్కడ జరుగుతోంది వైద్యమా లేక వ్యవస్థీకృత నేరమా అన్న అనుమానం కలుగుతోంది.

**అనుమతి పత్రం ముగిసి ఏడాన్నర కావస్తోంది!**

ఏ ఆసుపత్రి అయినా నడవాలంటే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఫాం-3 తప్పనిసరి. సంజీవని క్లినిక్‌కు జూన్ 2024లో కేవలం 90 రోజుల కోసం ఇచ్చిన తాత్కాలిక అనుమతి సెప్టెంబర్ 19, 2024 నాటికే ముగిసింది. గడువు ముగిసి 16 నెలలు దాటినా, ఎటువంటి చట్టపరమైన అనుమతులు లేకుండానే ఈ క్లినిక్ నడుస్తోంది. ఏపీ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం గడువు ముగిసిన మరుక్షణమే క్లినిక్ మూసేయాలి. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమంగా వైద్యం కొనసాగిస్తున్నారు డాక్టర్ పి.హరిప్రసాద్.

సినిమా లెవెల్‌లో 'మందుల' నెట్‌వర్క్!

ఈ క్లినిక్‌లో డాక్టర్ రాసే మందుల చీటీ పట్టుకుని మీరు ఊరంతా తిరిగినా మందులు దొరకవు. దీని వెనుక ఒక 'పి.సి.డి' చీకటి ఒప్పందం ఉంది. అజ్ఞాత ఫార్మా కంపెనీలు డాక్టర్లతో సీక్రెట్ డీల్స్ కుదుర్చుకుంటాయి. ఈ ఒప్పందంలో భాగంగా సదరు కంపెనీ ఆ మందులను బహిరంగ మార్కెట్లోకి వదలదు. కేవలం ఆ డాక్టర్ చెప్పిన షాపుకు మాత్రమే డెలివరీ ఇస్తుంది. మందుల అమ్మకాల్లో వచ్చే లాభంలో సింహభాగం డాక్టరుకు కమీషన్ల రూపంలో వెళ్తుంది. అందుకే బయట మార్కెట్లో రూ.20 లకే దొరికే సాదాసీదా మందును, తమ సొంత పి.సి.డి బ్రాండ్ పేరుతో రూ.400 నుంచి రూ.600 వరకు ఎంఆర్‌పీ వేసి అమ్ముతున్నారు. రోగిని పీల్చి పిప్పి చేస్తున్నారు.

బిల్లు అడిగితే కాగితం ముక్కే దిక్కు!

వేల రూపాయల మందులు అమ్ముతున్నా, అక్కడ ఇచ్చేది కేవలం ఒక చిన్న కాగితం ముక్క తప్ప, పక్కా జీఎస్టీ ఇన్‌వాయిస్ కాదు. బిల్లు ఇస్తే మందు ఏ కంపెనీది? దాని నాణ్యత ఏంటి? అనే నిజాలు బయటపడతాయి. రికార్డుల్లో దొరక్కుండా ఉండటానికి, ట్యాక్స్ ఎగ్గొడుతూ ఈ 'బిల్లు లేని దందా' సాగిస్తున్నారు. గుర్తింపు లేని సంస్థలకు నాణ్యమైన కంపెనీలు మందులు సరఫరా చేయవు, కాబట్టి ఇక్కడ విక్రయించేవన్నీ నాసిరకం లేదా నకిలీ మందులేనన్న అనుమానం బలపడుతోంది.

చట్టం ఏం చెబుతోంది? శిక్షలు ఎలా ఉంటాయి?

గడిచిన 16 నెలలుగా అనుమతి లేకుండా వైద్యం చేయడం, పి.సి.డి మందులతో దోచుకోవడం చట్టరీత్యా భారీ శిక్షలకు దారితీస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న భారతీయ న్యాయ సంహిత ప్రకారం శిక్షలు ఇవే:

– బిఎన్ఎస్ సెక్షన్ 318(4): లైసెన్స్ లేకపోయినా ఉన్నట్లు నమ్మించి ప్రజలను మోసగించి డబ్బు వసూలు చేసినందుకు 7 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

– బిఎన్ఎస్ సెక్షన్ 125: అనుమతి లేకుండా అక్రమంగా వైద్యం చేస్తూ ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించినందుకు కఠిన శిక్షలు పడతాయి.

– డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్: లైసెన్స్ లేని ఆవరణలో మందులు విక్రయించినందుకు మరియు నాసిరకం మందుల సరఫరాకు 7 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.

ముగింపు:16 నెలలుగా అక్రమంగా క్లినిక్ నడుస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? సామాన్యుడి ప్రాణం కంటే అధికారులకు సంజీవని న్యూరో క్లినిక్ యాజమాన్యం ఇచ్చే 'మామూళ్లే' ముఖ్యమా అని ప్రజలు అడుగుతున్నారు. తక్షణమే సంజీవని న్యూరో క్లినిక్ ను సీజ్ చేయాలని.. బాధ్యులైన డాక్టర్ పి.హరిప్రసాద్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రజా ఆరోగ్యంతో ఆడుకునే ఎంతటి వ్యక్తులైన చట్టం వదిలే ప్రసక్తే లేదని ప్రజలు' హెచ్చరిస్తున్నారు. ఇన్చార్జ్ కలెక్టర్ భరత్ వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మొదటిపేజి తరువాయి

చేదువాడ గ్రామంలో రెండు సిసి రోడ్లు 21 లక్షలు, శీల గ్రామంలో సిమెంట్ రోడ్డుకు35.50 లక్షలు,ఒంటి తాడిలో సీసీ రోడ్డుకు 11.50 లక్షలు, అలాగే రామచంద్రపురంమండలంలో భీమక్రోసు పాలెం రోడ్లకు 30 లక్షలు, నేలపర్తిపాడు రోడ్లకు 16 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కూడా నియోజవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి సుభాష్, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో జే.రాంబాబు, ఏఈ భవాని శంకర్, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, టేకుమూడి సత్యనారాయణ, వల్లూరి వీర వెంకట సూర్యనారాయణ చౌదరి, చిట్టూరి జానకిరామయ్య కృష్ణ, మంగయ్య చౌదరి, రాయుడు వీర్రాజు, తాతపూడి కుమార్ బాబు, పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష

**– ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్.జవహర్ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రయోజనాలపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ కే.ఎస్.జవహర్ మాట్లాడుతూ గతంలో తాను ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సమానంగా అమలు చేయడమే లక్ష్యంగా బాధ్యతతో పనిచేశామని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా 20 శాతం ప్రజల పట్ల ప్రత్యేక బాధ్యత వహించాల్సి ఉందని, నిబంధనల మేరకు 15 శాతం షెడ్యూల్డ్ కులాలకు అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంకా అసమానతలు ఉన్నట్లు తనదృష్టికి వచ్చిందని,రెండుగ్లాసులు విధానం కాకుండా నేటి సమాజంలో రెండు బెంచీలు విధానం కొనసాగుతోందన్న వాస్తవాన్ని గుర్తించామని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అధికారులు పనిచేస్తూ అర్హత కలిగిన పేద షెడ్యూల్డ్ కుల కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలవాలని సూచించారు. పేదల కోసం పనిచేసే సేవాభావన ప్రతి ఒక్కరిలో ఉండాలని, "మనమే ఆ స్థితిలో ఉంటే" అనే ఆలోచనతో విధులు నిర్వర్తించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో వివక్ష, సంఘర్షణ చోటు చేసుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తూ, కమిషన్ నిర్దేశించిన అధికారాలకు విశేష అధికారాలు ఉన్నప్పటికీ అవి హోదా ప్రదర్శన కోసం కాదని, అర్హులకు న్యాయం చేయడానికేనని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ దళిత సంఘాల నాయకులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనం తరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో సమీక్షలు నిర్వహించి దళిత వర్గాల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారఅందరూ సమానం అనే భావనను పెంపొందిం చేందుకే కమిషన్ విస్తృత పర్యటనలు చేస్తోందని వివరించారు.

్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్లు ఎందుకన్న ప్రశ్నలు వస్తున్నాయని, తాను కూడా ఒకప్పుడు అలా అనుకున్నానని, కానీ క్షేత్రస్థాయి పర్యటనల్లో ఇంకా వివక్ష వాస్తవంగా ఉందని గ్రహించానన్నారు. ప్రతి శాఖ తమ శాఖల వారీగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వాస్తవ సమాచారాన్ని తెలియజేయాలని, తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు అందని పథకాలను క్యారీ ఫార్వర్డ్ చేయాలని, వెనరబుల్ ఏరియాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరంగా 32, పోలీసు పరంగా 9 అర్జీలు పరిష్కరించాల్సి ఉండగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. అవసరమైన అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి కూడా సమాచారం ఇచ్చి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి : సి.ఐ.విల్సన్,ఎస్.ఐ.ఎం.భాష

**భీమడోలు,మేజర్ న్యూస్:** రోడ్డు నియ మ నిబంధనలను పాటించండి.మీతో పాటు ఇతర వాహ నదారుల రక్షణకు సహకరించండని, సి.ఐ.విల్సన్,ఎస్.ఐ.మదీనా భాష కోరారు.రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం 216-ఎ-జాతీయ రహదారిపై భీమడోలు రైల్వే గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఎన్.టి.పి.సి. విశ్రాంత ఉద్యోగుల ఐ క్యాంప్ నిర్వహణ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎన్.టి.పి.సి. విశ్రాంతి ఉద్యోగులు స్థానిక రేచర్లపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మొండి రవికుమార్, గౌరవ అతిథిగా కార్యదర్శి అలీమ్ పాల్గొన్నారు. సిరి ఆప్టికల్స్ అధినేత ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 154 మందికి కంటి దోషాలను గుర్తించి వారి అందరికీ లక్ష యాభై వేల రూపాయలు విలువచేసే అత్యాధునిక కళ్ళజోళ్లను అందజేశారు.
ఎన్టిపిసి విశ్రాంతి ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కె.వి.బి. ఆచారి మాట్లాడుతూ ఎస్.భావరాజు సలహాలతో 16వ సేవా కార్యక్రమంలో భాగంగా తమ మిత్రులు సహకారంతోఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగు లందరూ ఎప్పటికప్పుడు సేవాకార్యక్రమాలనిర్వహణకు ఆలోచన చేయడమే కాకవాటి అమలుకు కూడాకార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నామని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకు, పేదలకు తమ సేవలు సద్వినియోగం అవ్వాలన్న భావనతో మరియు తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఇప్పటికి వరకు 15కు పైగా సేవా కార్యక్రమాలు వృద్ధాశ్రమాలు, అనాధ బాలబాలికల పాఠశాలలోనూ, కళాశాలలోనూ, ఆర్ఫనేజ్ లోను, వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సంస్థలలోనూ చేట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పారు. లబ్ధిదారులందరూ ఎంతో ఆనందంగా తమ సేవలను స్వీకరించడమే కాక కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తూ ఫోన్లు చేయడం మా సేవలకు సార్ధకత ఏర్పడిందన్న భావనను కె.వి.బి. ఆచారి వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి డాక్టర్ మొండి రవికుమార్ మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శేష జీవితంలోను సమాజంలో ఎంతో ఆనందాన్ని పంచుతూ మరియు ఆనందాన్ని పొందుతున్న ఇటువంటి విశ్రాంత ఉద్యోగులు ఎందరికో మార్గదర్శకులు మరియు స్ఫూర్తి ప్రదాతలని రవికుమార్ కొనియాడారు. కార్యక్రమంలో ఎన్.టి.పి.సి. విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఎస్.భావ రాజు, ఎస్.వి.ఎస్.సూర్యనారాయణ,బి.వెంకటేశ్వరరావు, ఏ.రామకృష్ణ, మెహర్ కుమార్, కే.సి. అప్పారావు, అచ్చన్న, పిఎస్సీ ప్రసాద్, ఎం.పనసయ్య ప్రభృతులు ఆధ్వర్యంలో సుమారు 5 గంటల పాటు కంటి పరీక్ష మరియు కళ్ళజోళ్ళు పంపిణీ సేవాకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహణలో ఎంతో సహకారం అందించిన సిరి ఆప్టికల్స్ అధినేత ప్రసాద్ ను ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు.

# నంది అవార్డు పొందిన వీర్నాల రమణబాబును అభినందించిన వీర్రాజు

**– సోము వీర్రాజును మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు**

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గంద్రోతు వీరగోవిందరావు, వీర్నాల రమణబాబు, గోనెమడతల కనకరాజు మంగళవారం నాడు శాసనమండలి సభ్యులు, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయ కార్యవర్గసభ్యులు సోము వీర్రాజును రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుద్ర బెస్ట్ హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన నంది అవార్డ్స్ ఆల్ ఇన్ వన్ టాలెంట్ అవార్డ్స్ కార్యక్రమంలో నంది అవార్డును అందుకున్న రావులపాలెంకు చెందిన జానపద టీవీ కళాకారుడు, బీజేపీ కార్యకర్త అయిన వీర్నాల రమణబాబును సోము సత్కరించారు.



# ఘనంగా సత్య సాయి సేవా కేంద్రం వార్షికోత్సవం



**– వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహణ**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం శ్రీ సత్యసాయి సేవా సమాజం 19వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తొలితగా గ్రామ నామ సంకీర్తన పథకావిష్కరణ చేశారు. 90 రోజులు కొట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 47 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ట్రైనర్ ద్వారకామాయిని ఘనంగా సత్కరించారు. అలాగే నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 357 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిత్యాన్నదానానికి సహకరించిన తేజా రెడ్డి, డాక్టర్ మణిహంస, గాదిరాజు ప్రసాదరాజు, ట్రస్ట్ సభ్యులు వేపకా యల రామారావు, మురళి, సాయిబాబు, రామకృష్ణ, త్రిమూర్తులు, నారాయణరాజు, పాండురాజు, మన్యం పర్వత వర్ధన్ రావు, కొవ్వూరి వివేకానంద రెడ్డి, నడింపల్లి రామకృష్ణంరాజు, మేడపాటి భాస్కర్ రెడ్డి, చిన్న సోమిరెడ్డి, సిద్ది రెడ్డి రామకృష్ణ, ఒంటెద్దు బంగారయ్య, కొవ్వూరు బ్రహ్మానందరెడ్డి తదితరులు సహకారం అందించారు. వైద్యులు డాక్టర్ ప్రదీప్తి, కరుణ, నల్లమల్లి సత్య శ్రీ, మెంటే ఉదయ భాస్కరరావు, కరీం వైద్య సేవలు అందించారు.

## పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు



**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరు మండలంలోని పెద్దశితనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం రైతు సేవా కేంద్రంలో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పంచాయతీ పరిధిలో పశు సంవర్ధకశాఖ యు.అనిల్ కుమార్ మరియు ఎన్.ప్రవీణ్ చీడుమూరు ఆర్.ఎస్.కె. క్యాంపు నిర్వహించి పశువులకు నత్తల మందు పట్టించడం జరిగినది. మేకలకి, గొర్రెలకి, ఆవులకి, గేదెలకి వాక్సినేషన్ మరియు పశు గ్రాసం మరియు పశు వులకు ఇన్సూరెన్స్ చేయించాలని గ్రామస్థులకి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తీగల రవి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కారం దుర్గారావు, గ్రామస్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థుల వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీసిన విజ్ఞాన ప్రదర్శన





**రాజమండ్రి,మేజర్‌న్యూస్:** స్థానిక దానవాయిపేటలోని ఆక్స్ఫర్డ్ ఒలం పియాడ్ పాఠశాలలో పాఠశాల స్థాయి విజ్ఞాన ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు ఈ ప్రదర్శనలో అనేక వినూత్న వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సఖినేటిపల్లి స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శైలేంద్ర విచ్చేసి విద్యార్థుల యొక్క ప్రాజెక్టులను పరిశీలించి వారికి తగు సలహాలు సూచనలు అందిం చారు. మరొక ముఖ్య అతిథిపాఠశాల రీజనల్ ఇంచార్జ్ శ్రీమతి ఉమా రాణి మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న వైజ్ఞానిక ప్రతిభను వెలికిదీ యడమే ఈ విజ్ఞాన ప్రదర్శన యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా మాధురి, ఇన్చార్జెస్ జ్యోతి కిరణ్, సౌమ్యతదితర ఉపాధ్యాయినీఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయంలో బహిరంగ, సీల్డ్ టెండర్ల నిర్వహణ



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం బహిరంగ మరియు సీల్డ్ టెండర్లను నిర్వహించారు. ఈ టెండర్ల ద్వారా దేవస్థాన ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేసే హక్కునకు, శ్రీనివాస ప్రాంగణంలో రెండు తాత్కాలిక షాపులకు (3 సంవత్సరాల కాలపరిమితికి) అలాగే లడ్డు బాక్సులు సరఫరా చేసే హక్కును టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లు ది.01-02-2026 నుండి ది.31-01-2027 వరకు ఒకసంవత్సర కాలపరిమితికి సంబంధించి నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. టెండర్ల ప్రక్రియను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షించి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, శిష్టా సూర్య కుటుంబరావు, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఏవీ నగరం వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వైభవంగా 9వ ఆవిర్భావ వేడుకలు







**– స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్, ఈవో త్రినాథరావు**

**అన్నవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక ఏవీ నగరం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి, శ్రీభూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామివారి 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. ఈ పుణ్య సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తరపున స్వామివారికి విశేష మర్యాదలు జరిగాయి.

**ఘనంగా పట్టువస్త్రాల సమర్పణ..** ఆవిర్భావవేడుకల్లోభాగంగా అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్ మరియు కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆలయాన్నిసందర్శించారు. ఈసందర్భంగా అన్నవరం స్వామివారి తరపున కళ్యాణ వేంకటేశ్వరస్వామికి మరియు అమ్మవార్లకు:

– మంగళకరమైన పట్టువస్త్రాలు
– సుగంధభరిత పుష్ప మాలలు
– వివిధ రకాల ఫలములు
– నైవేద్యంగా ప్రసాదాలను అత్యంత భక్తితో సమర్పించారు.

భక్తుల కోలాహలం..ఆలయ అర్చకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ రోహిత్ మాట్లాడుతూ, లోకకళ్యాణం కోసం వెలసిన వేంకటేశ్వరస్వామి వారి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడంసంతోషకరమని, స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.మొత్తం మీద ఏవీ నగరం గ్రామం గోవింద నామస్మరణతో మారుమోగిపోయింది.

# ఏపీపీఎస్‌సి గ్రూప్-2 ఫలితాల్లో శ్యామ్ సంస్థ విద్యార్థుల ప్రతిభ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 ఫలితాల్లో కాకినాడలోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో సంస్థ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వివిధ విభాగాల్లో ఎంపికై ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సంస్థ చైర్మన్ జి. శ్యామ్ తెలిపారు.

ఈ ఫలితాల్లో మొత్తం 89 మంది విద్యార్థులు విజయం సాధించగా, అందులో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదితర కీలక పోస్టుల్లో ఎంపికయ్యారని పేర్కొన్నారు. 2025 డిసెంబరులో జరిగిన గ్రూప్-2 ప్రాథమిక పరీక్షల్లో 712 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 2026లో నిర్వహించిన ప్రధాన పరీక్షల్లో 186 మంది విద్యార్థులు మెయిన్స్‌కు అర్హత సాధించడం విశేషమని తెలిపారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న నిపుణులైన అధ్యాపక బృందం మార్గదర్శ కత్వం, క్రమబద్ధమైన శిక్షణ, ప్రత్యేక స్టడీ మెటీరియల్, డైలీ టెస్టులు, రివిజన్ తరగతుల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో కీలకమని శ్యామ్ అన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్యామ్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా గ్రూప్-1, గ్రూప్-2, డిగ్రీ, సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం అభినందించింది.

# ఎన్‌హెచ్-216ఈ విస్తరణతో నివాసాలు కోల్పోతున్నామని కలెక్టర్‌కు వినతి






**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి రావులపాలెం వరకు జాతీయ రహదారి-216ఈ విస్తరణ ప్రతిపాదనలో భాగంగా రోడ్డు వెడల్పు చేయనున్న కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని బాధితులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు రావులపాలెం మండల వేదిశ్వరం గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. కొత్తపేట మండలం పలివెల వంతెన నుంచి రావులపాలెం మండలం వెదురేశ్వరం మీదుగా రాళ్లగండి,బొక్కవారిపాలెం ప్రాంతాల వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు అధికారులు ప్రతిపాదించారు. ఈ రోడ్డు విస్తరణ వల్ల నివాస గృహాలు, వివిధ కమ్యూనిటీలకు చెందిన భవనాలు, పాఠశాల భవనాలు, చర్చిలు, మసీదులు, హిందూ దేవాలయాలు, అలాగే సన్న, చిన్న కారు రైతుల భూములు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి-216ఈ విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారు కోనసీమ జిల్లా కలెక్టర్‌కు మరియు కొత్తపేట రెవెన్యూ సబ్ డివిజన్ అధికారి (ఆర్డీవో) వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దండు సుబ్రహ్మణ్యం రాజు,గుమ్మడి బాలకృష్ణ, గుమ్మడి చిరంజీవి, దొడ్డిపట్ల నాగచంద్ర, నరసింహారాజు,టి.ఆర్.రత్నరాజు,ఖండవిల్లిరాజు తదితరులతో పాటు సుమారు 80 మంది బాధితులు పాల్గొని తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు విస్తరణ పనుల్లో నష్టపోయే వారికి న్యాయం చేయాలని, తగినపరిహారం చెల్లించాలని వారు కోరారు.

# గిరిజనుల హక్కుల ఉల్లంఘనలపై ఏపీ ఎస్.టి కమిషన్ విచారణ





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మారేడుమిల్లి మండలం గుడెస గ్రామంలో గిరిజనుల హక్కుల ఉల్లంఘనలపై ఏపీ ఎస్.టి కమిషన్ విచారణ నిర్వహించారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని గుడెస గ్రామంలో 2022 నుంచి సిబిఇటి కమిటీ, అటవీశాఖ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం పరస్పర సమన్వయంతో టూరిజం నిర్వహణ జరుగుతోంది. అయితే ఒప్పందం కుదిరి మూడేళ్లు గడుస్తున్నా, గ్రామానికి రోడ్లు, తాగునీటి సౌకర్యం, గృహాలు, సరైన పాఠశాల వంటి కనీస మౌలిక వసతులు ఇప్పటికీ కల్పించలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.గుడెస పేరుతో జరుగుతున్న టూరిజం ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతు న్నా, ఆ లాభాలు గ్రామాభివృద్ధికి ఉపయోగించకపోవడం తీవ్ర అన్యాయమని గ్రామస్థులు పేర్కొన్నారు. అంతేకాకుండా గిరిజనులు తాగునీటిగా వినియోగించే కొండ కాలువలులో టూరిస్టులు మలమూత్ర విసర్జనలు చేయడం వల్ల ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని గిరిజనులు తెలిపారు. మండలంలో ఏమూల చూసినా ప్లాస్టిక్ చెత్త, పగిలిన మద్యం సీసాలు అడవిలో విపరీతంగా పడేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని చెప్పే అటవీశాఖ అడవిలో భోజనం చేస్తున్న ఆదివాసీలపై మాత్రం ఫైన్ వేస్తోందని గిరిజనులు పేర్కొన్నారు. కానీ అడవిలో వాతావరణం కాలుష్యం చేస్తున్న టూరిజం మాఫియాపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇటీవల అడవిలో భోజనం చేస్తున్న ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు అనవసరంగా ఫైన్ విధించారని, ఫిట్నెస్ లేని వాహనాలు, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపించడం వల్ల గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నా, ఒక్క అధికారి బాధ్యత వహించలేదన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై ఆయా గ్రామాల పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ కు ఫిర్యాదు చేయగా, దాని భాగంగా బుధవారం విజయవాడలోని ఏపీ ఎస్.టి కమిషన్ కోర్టులో చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి జడ్జి హోదాలో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు సంబంధించి పోలవరం జిల్లా సబ్-డీఎఫ్‌వో, డీడీ ట్రైబల్ వెల్ఫేర్, డీఎస్పీ విజయవాడకు కమిషన్ సమన్లు జారీ చేయగా, వారు కమిషన్ ముందు హాజరై తమ వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు విన్న అనంతరం, గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం జరిగేలా ఆదేశాలు జారీ చేస్తామని చైర్మన్ తెలిపారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఫర్ గర్ల్స్' ప్రారంభం



**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పి.యం.ఉష ఆర్థిక సహకారంతో బుధవారం నుండి "సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఫర్ గర్ల్స్"ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యంతెలియజేశారు. ట్రైనింగ్ ప్రారంభం సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల ఆత్మ రక్షణకు పది రోజులపాటు ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ట్రైనర్స్‌గా ఒంగోలు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నుండి లక్ష్మణ్, రాజేష్, చంటి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్,పి.యం.ఉష కోఆర్డినేటర్‌జి.వెంకట్రావు,డాక్టర్ కె.శకుంతల,జి.హారతి,ఎస్.అప్పనమ్మ,జి.సాయికుమార్, ఎన్.ఆనంద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్లరాయి క్వారీలో నిధులు దుర్వినియోగం!





**– తక్షణమే స్పందించాలని బాధితులు ఆవేదన**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** క్వారీ నిధులు వినియోగంపై లెక్కలు చూపిస్తామంటూ ప్రతిసారి దాట వేస్తున్న క్వారీ నిర్వాహకులపై చర్యలకు బాధితులు డిమాండ్ చేసారు.అధికారులు, క్వారీ సొసైటీ నిర్వహకులు క్వారీ లెక్కలు చూపిస్తామన్నారు, బాధితులకు న్యాయం చేస్తామన్నారు, కానీ అడ్రస్ లేరని, దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని బాధితుల విజ్ఞప్తి చేస్తున్నారు.రంపచోడవరం మండలం నరసాపురం గ్రామంలో నల్లరాయి క్వారీల వలన నష్టం జరుగుతుందని, సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే నల్లరాయి క్వారీలో నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని, అలాగే క్వారీవల్ల నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని క్వారీ బాధితులు కొంతకాలంగా ఉద్యమం చేస్తున్న విషయం విధితమే. క్వారీ గురించి సమావేశం జరుగుతున్న ప్రతిసారి పిటిషనర్లపై కొంతమంది కక్షపూర్వకంగా గొడవలు చేసిదాడులకు తెగబడుతున్నారని, అధికారులు, పోలీసుల సమక్షంలో సమావేశం ఏర్పాటుచేసి క్వారీ వల్ల జరుగుతున్న నష్టంపైన, నిధులు దుర్వినియోగంపై సమావేశం ఏర్పాటు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పిఓ, ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా ఈనెల 22వ తేదీన రంపచోడవరం తాసిల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్, షెడ్యూల్ తెగల చైర్మన్ సమక్షంలో నరసాపురం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారని, ఈ సమావేశంలో అధికారులు, క్వారీ నిర్వహకులు కలిసి 28వ తేదీ బుధవారం సమావేశం ఏర్పాటు చేసి క్వారీ నిధులు వినియోగంపై లెక్కలు చూపిస్తారని, క్వారీ వల్ల నష్టపోతున్న బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చిన అధికారులు, క్వారీ నిర్వహకులు ఎటువంటి సమావేశం ఏర్పాటు చేయకుండానే మళ్ళీ తప్పించుకున్నారని బాధితులు ఆరోపించారు. సమావేశం ఏర్పాటు చేస్తారని ఉదయం నుండి ఎదురుచూసామని, కానీ అధికారులు, క్వారీ నిర్వాహకులు ఎవరు రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేసారు. గ్రామానికి ఉపయోగపడని, ప్రజల ఆస్తులకు నష్టపరిచే ఇటువంటి క్వారీలు అవసరం లేదని, తక్షణమే క్వారీలు నిలుపుదల చేసి ప్రజలకు న్యాయం చేయాలని బాధితులు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజన మహిళలు పొడియం అరుణకుమారి, కోటం పండమ్మ, కోటం సోమాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేకాధికారి డా.రామ్‌ప్రసాద్ తెలిపారు. పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో బుధవారం దివిలి వెటర్నరి డాక్టర్ మస్తాన్ బీ ఆధ్వర్యంలో ఎడిఎ టి.ఎన్.వి.ఎస్.తుమ్మల రామస్వామి అధ్యక్షతన పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రత్యేకాధికారి డా.రామ్‌ప్రసాద్, పశు సంవర్ధక శాఖ డిడిలు అంబేద్కర్, కాంతారావులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని, వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 125 గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పచ్చిపాల సతీష్, డా.కళ్యాణి, డా.వినోద్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" చైర్మన్‌కు ఘనసత్కారం



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను పలువురు ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ద్వారా పొంది గవర్నర్ భవన్‌లో ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఏపీ ఎన్జీవో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అభినందనలు తెలియచేసారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిక్కాల సూర్యారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెట్టా సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలు అశోక్, శ్రీవెంకటేష్, ఉపాధ్యక్షులు ఇమ్మమ్ షరీఫ్, అధికసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.అలాగే రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్వైజర్ పలివెల శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, ప్రజాసేన అధ్యక్షుడు, ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు కాటే సుబ్రహ్మణ్యంలు కూడా వాసంశెట్టి సత్యంను పూలమాలలు, దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు.

## సర్వే ప్రగతిని పరిశీలించిన ఎంపిడిఓ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ బుదవారం జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాలలో మండల స్వర్ణ గ్రామాధికారి వై.శ్రీహరితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సచివాలయ, సర్వే సిబ్బందితో మాట్లాడుతూ సర్వే త్వరితగతిన ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి చేయాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# గవర్నమెంట్ నేషనల్ గేమ్స్‌లో రాష్ట్రీయ స్థాయి నుండి జాతీయ స్థాయికు ఎంపికైన పూజ



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఈనెల 31వ తేదీన జరగబోయే నేషనల్ కరాటే టోర్నమెంట్లో పూణేలో ఆడబోతున్న పూజను రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సాలువా కప్పి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఇలాంటి స్కూల్ గేమ్స్ మరిన్ని ఆడాలని మరిన్ని పతకాలు సాధించాలని ఇందులో మన రాజముండ్రి నుండి అమ్మాయి ఎంపిక అయినందుకు అభినందనలు తెలిపారు. పూజను కోచింగ్ ఇస్తున్న అరుణ్ కుమార్‌ని అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో జామి కృష్ణ, కరాటే మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## సిరిపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పి 4 ప్రణాళికలో శాసనసభ్యురాలు ప్రత్తిపాడు నియోజకవర్గ వరపుల సత్యప్రభ రాజా చొరవతో ప్రజల అవసరాల మేరకు ఏలేశ్వరం మండలం ఎర్రవరం పంచాయతీలో గల సిరిపురం గ్రామంలో సిపిఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం కార్యక్రమాన్ని శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ పీతల నూకరాజు, ఎక్స్ ఎంపీటీసీ సంఘం ప్రభుజి , ఒనుము మంగా , ధనే కుల అదృష్టదీపుడు, ధనేకుల భద్రరావు, సాగి వెంకటరమణ, దొడ్డి శ్రీను, సాల వీరబాబు ఎంపీడీవో సిహెచ్ రవికుమార్ వర్మ అలాగే పంచాయతీ సెక్రెటరీ ఏవి గోవింద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 400 మంది హాజరై ఉచిత కంటి వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు మరియు కళ్ళజోడులు పొందారు. పి4 కు చైర్మన్గా వ్యవహరిస్తున్న శాసనసభ్యుల ఆదేశాలతో మరియు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ .శ్రీనివాసరావు ఆదేశాలతో ఏలేశ్వరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ రవికుమార్ వర్మ మరియు సి వి ఏ పి టీం సభ్యులైన ఆర్.ఉదయ్ కిరణ్, బి. సుమిత్ర ,పి .గణేష్ ,బి .నరేంద్ర, పి 4 తరుపున ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

# అంతర్వేదిలో వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవ వేడుకలు

**– స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఉప కార్యనిర్వహణాధికారి పి.బాబురావు**



**అంతర్వేది/అన్నవరం,మేజర్‌న్యూస్ :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన అంతర్వేది క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారికి, అమ్మవారికి దేవస్థానం తరపున అధికారికంగా పట్టువస్త్రాలను సమర్పించారు.

**శాస్త్రోక్తంగా పట్టువస్త్రాల సమర్పణ..**దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి పి.బాబురావు, వేద పండితులు మరియు అర్చక బృందంతో కలిసి మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి, లక్ష్మీదేవి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా వేద పండితులు మంత్రపుష్పాలతో స్వామివారిని అర్చించి, ఆశీర్వచనాలు అందజేశారు.

**భక్తుల కోలాహలం..**కళ్యాణోత్సవ వేడుకలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణ మంతా "గోవింద నామ" స్మరణతో మారుమోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు విస్తృతఏర్పాట్లు చేశారు.

**ముఖ్య విశేషాలు:**

- ఆలయ సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా జరిగిన పట్టువస్త్రాల సమర్పణ.
- వేద పండితుల ఆశీర్వచనాలతో పవిత్రంగా సాగిన కార్యక్రమం.
- పాల్గొన్న అర్చక బృందం మరియు ఆలయ సిబ్బంది.

ఈకళ్యాణోత్సవం లోకకళ్యాణార్థంనిర్వహించబడుతోందని,భక్తులందరూ స్వామివారికృపకుపాత్రులుకావాలనిఈసందర్భంగా అధికారులు కోరారు.

# రాజకీయ పార్టీలు సహాయ, సహకారాలను అందించాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలకు సహాయ, సహకారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు.. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల కమీషన్ సూచనల మేరకు జిల్లాలో చేపడుతున్న ఓటరు జాబితా కార్యక్రమాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన, ఫారం-6, 7, 8 పరిష్కారం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్ - సర్) వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాలు అన్ని సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 07 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,46,751 మంది ఓటర్లుగా నమోదైయ్యారన్నారు. ఓటర్ల జాబితాలోని పేర్లు చేర్పులు, మార్పులు, తొలగింపు, కొత్తగా ఓటు నమోదు వంటి అంశాలపై 2026 జనవరి 01 నుంచి 26వ తేదీ వరకు ఫారం -6, 7, 8 లకు సంబంధించి 1,737 దరఖాస్తు వచ్చాయన్నారు. వీటన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఓటర్ల సౌలభ్యాన్ని పరిగణలోకి తీసుకుని పునర్వవస్థీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ నిర్వాహణకు అనువుగాలేని కేంద్రాలను అనువైన మరో భవనంలోకి మార్పుకు ప్రతిపాదిస్తామన్నారు. హేతుబద్ధీకరణ ప్రకారం జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు రానున్నాయని డీఆర్వో తెలిపారు. జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి ఎన్నికల కమీషన్ నిర్దేశించిన బిఎల్ఏ-2 ఫారమ్ లో వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ కు సంబంధించి జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది డీఆర్వో వివరించారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), ఏ.వి.వి. సత్యనారాయణ (జనసేన), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సీపీ), సబ్బారపు అప్పారావు (బిఎస్పి); పోలిశెట్టి శ్రీనివాసు (ఐ.ఎన్.సీ), పలివెల వీరబాబు (సీపీఎం), అడబాల సత్యనారాయణ (జనసేన), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ హుండీలు లెక్కింపు



సామర్లకోట,మేజర్‌న్యూస్ : ముత్యాలమ్మ ఆలయ హుండీలను బుధవారం బల్ల నీలకంఠం కార్యనిర్వహణాధికారి, కుమార రామ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, సామర్లకోట వారి పర్యవేక్షణలో అర్చక ఆసాది కే రవి బాబు, సిబ్బంది, భక్తులు సమక్షంలో తెరిచి లెక్కింపు చేయగా ది.20.1.26 నుండి 28.1.26 కాలమునకు అనగా 9రోజులకు రూ.1,29,806/- లు నగదు వచ్చినది అని ఇందుమూలంగా తెలుపుచున్నాము. ఈ కార్యక్రమంలో టీవీ సూర్యనారాయణ, కార్యనిర్వహణాధికారి, ఎస్.అంజిబాబు, పోలీస్ కానిస్టేబుల్, సిబ్బంది బిక్కిన నాని, మనోజ్ కుమార్, వీర్రాజు వి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ అవార్డు అందుకున్న సత్యనారాయణ



**పెరవలి, మేజర్ న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో 2025-26 సంవత్సరములో చేసిన విశిష్ట సేవలలకు గాను పెరవలి మండలంలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యుఎన్‌వి సత్యనారాయణకు గణతంత్ర దినోత్సవ వేడుక అవార్డు వచ్చింది. జనవరి 26వ తేదీ సోమవారం వై.మేఘ స్వరూప్ గౌరవ ఇంచార్జ్ కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, తూ.గో.జిల్లా, ఐ.ఎ.ఎస్ వారి చేతుల మీదుగా ఈ అవార్డును యుఎన్వి సత్యనారాయణ అందుకున్నారు.

## 5 తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరణ

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** అడ్డతీగల గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రభాకర రావు తెలిపారు. 2026, 2027 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ఇంగ్లీష్ మీడియంకి ఈ ప్రవేశాలు తీసుకుంటామన్నారు. నాలుగో తరగతి చదివిన విద్యార్థులు ఫిబ్రవరి 28 లోపల ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను అన్ని గురుకుల పాఠశాలలందు నెట్ సెంటర్లో చేయబడును అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రం కచ్చితంగా ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# అనుభవజ్ఞుడి సారథ్యంలో గ్రామీణాభివృద్ధి

**- డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతలు స్వీకరించిన నగేష్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బుడ్డెపు నగేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలోని వైటిసి ఆవరణలో ఉన్న డీఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ఘనస్వాగతం పలికారు.

-అపార అనుభవం.. కీలక బాధ్యతలు

నగేష్ కేవలం ఒక అధికారిగానే కాకుండా, పరిపాలనలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపుపొందారు.ప్రస్తుతంఆయనరాజమండ్రిలోని రాందాస్ కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆయన నిర్వహించిన -బాధ్యతలు ఆయన పనితీరుకు నిదర్శనం

-జిల్లా స్థాయిలో : శ్రీకాకుళం, వైఎస్సార్ కడప జిల్లాలకు జడ్పీ సీఈఓగా సేవలు అందించారు.

- గ్రామీణ, పట్టణాభివృద్ధి : గతంలోనే డీఆర్‌డీఏ, మెప్మా (వెలుగు) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

- వైవిధ్యమైన రంగాలు : విద్యాశాఖలో (సర్వశిక్షా అభియాన్ పీఓ), గిరిజన సంక్షేమం, విపత్తు నిర్వహణ, మరియు కోవిడ్ సమయంలో జిల్లా కోఆర్డినేటర్?గా క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేశారు.

-బ్యాంకింగ్ & ఆడిట్: విజయనగరం, సాలూరు కోఆపరేటివ్ బ్యాంకుల బాధ్యతలతో పాటు డీసీసీబీలో ఓఎస్డీగా పనిచేశారు.

పేదల జీవనోపాధియే లక్ష్యం బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగేష్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే తన ప్రాధాన్యత అని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసి, ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, ఉపాధి హామీ పథకం ద్వారా పేదల జీవనోపాధి మెరుగుదలకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. సత్యం నాయుడు నూతన పీడీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించండి

**- కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కోరిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా చేసేందుకు సహకరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోరారు. పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని శ్రీవైష్ణవ్‌తో సమావేశం అయ్యారు. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పలు అంశాలపై చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని, ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందన్నారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్‌ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని, అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన విఖ్యాత క్షేత్రాలు పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరారు. అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**- ఏఐటీయూసీ నాయకులు సాకా రామకృష్ణ పిలుపు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని రంగాల కార్మిక సంఘాల ఐక్యతతో ఫిబ్రవరి 12 తేదీన జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు సాకా రామకృష్ణ పిలుపునిచ్చారు. పిఠాపురం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐ టియుసి) అనుబంధం పిఠాపురం శాఖ యూనియన్ బంగారు కన్నయ్య అధ్యక్షతన స్థానిక మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసును బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసి నాయకులు సాకా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ కార్మిక సంఘాలు కష్టపడి సాధించుకున్న చట్టాలను నేటి పాలకులు నిర్వర్యం చేస్తూ 44 చట్టాన్ని నాలుగు లేబర్ కోడ్స్‌గా చేయడం దారుణమన్నారు. 12 గంటలు పని దినాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం సరైనది కాదని, మున్సిపల్ రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం, పర్మినెంట్ సిబ్బంది పెంపు, పని కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిని పెంచే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

## నల్లాకులవారిపాలెంలో సిసి రోడ్ శంకుస్థాపన



**పెరవలి,మేజర్‌న్యూస్ :** నల్లాకులవారిపాలెం గ్రామంలో జనవరి 28వ తేదీ బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా సిసి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సిసి రోడ్డుకు సంబంధించి నిధులు మంజూరు చేయించిన నిడదవోలు నియో జకవర్గ శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ పర్యాటక సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కి నల్లాకులవారిపాలెం గ్రామ ప్రజ లు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్లాకుల వారిపాలెం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకలి కేకలు - వేళాపాలా లేని మధ్యాన్న భోజనం





**- ర్యాలి జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల ఆందోళన**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** పేరు ఘనం కానీ పథకం అమలులో నిలువెత్తు నిర్లక్ష్యం.అడుగడుగునా అవమానం. ఇది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాన్న భోజన పథకం అమలు తీరు. ఆపాఠశాలలో విద్యార్థులు ఆకలి కేకులతో అలమటిస్తున్నారు. వేళాపాల లేని మధ్యాన్న భోజనం పథకం అమలు తీరుతో నిర్వాహకులు అవహేళన చేస్తూ మట్లాడుతున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం ఆందోళన వ్యక్తం చేస్తు నిరసన తెలిపారు.మధ్యాహ్నం భోజనం సకాలంలో అందక బాల బాలికలు (విద్యార్థులు) తగిన సమయంలో భోజనాలు పెట్టకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో మధ్యాన్న భోజన పథకం అమలు తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు దృష్టికి తీసుకువెళ్లడంతో వారంతా పాఠశాల వద్దకు చేరుకుని సంబంధిత పథకం నిర్వహకులు, అధికారులపై గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వక్తం చేశారు. ఇష్టమైతే వండుతాము లేదంటే లేదు అని విద్యార్థులపై సిబ్బంది చిరాకు వ్యక్తం చేయడంతో వారంతా నినాదాలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

240మంది విద్యార్థులు వుండగా 70 కోడిగ్రుడ్లు ఉడికించి 70 మందికి పంపిణీ చేస్తున్నారు అని విద్యార్డులు ఆరోపించారు. సరైన సమయానికి భోజనాలు అందించి, అందరికి గ్రుడ్లు పంపిణీ చేయకుండా అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకి పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో సమయానికి భోజనాలు అందించి అందరికి గ్రుడ్లు పంపిణీ చేస్తామని నిర్వాహకులు హామీఇవ్వడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కాకినాడ సీపోర్ట్ సీఈవోకు సమ్మె నోటీసు

**- ఫిబ్రవరి 12 పోర్టు కార్యకలాపాలను అడ్డుకుంటాం**
**: కార్మిక సంఘాలు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా కాకినాడ సీ పోర్టు సీఈఓకు కేంద్ర కార్మిక సంఘాలు సమ్మె నోటీసును అందించారు. ఫిబ్రవరి 12వతేది ఒకరోజు సీ పోర్టును మూసి వేసి రైతులు, కార్మికులు చేసే సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం సీపోర్టులను అదానీపరం చేయడాన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. కాకినాడ పోర్టు వ్యాపారాన్ని అదానికున్న పలుకుబడితో గంగవరం పోర్టుకు తరలించుకుపోవడం వల్ల కాకినాడ పోర్ట్‌లో పనిచేసే కార్మికులకు, చిన్న చిన్న కాంట్రాక్టర్లకు పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టుని ఆనుకొని ఉన్న పారిశ్రామిక వాడలో సగానికి పైగా పరిశ్రమలు మూసివేయడంతో ఉన్న ఉపాధి కూడా పోయిందని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకొని మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు.ఈ



కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టియుసి ఏపీ అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు రఘువులు పాల్గొన్నారు.

# జిల్లాలో "స్పర్శ" కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాల ప్రారంభం

**- వివక్షతకు తావులేకుండా కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి**
**- జిల్లా కలెక్టర్ వై.మేఘా స్వరూప్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కుష్టు నివారణ పక్షోత్సవాలు ఈ ఏడాది లి"స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం "గా జనవరి 30, 2026 నుండి ఫిబ్రవరి 13, 2026 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలనీ పిలుపు ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్ లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ వై. మేఘా స్వరూప్ వారి సమక్షంలో పోస్టర్ విడుదల అన్ని శాఖల అధికారుల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలను స్మరించుకుంటూ, గాంధీ వర్ధంతి అయిన జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరిగే ఈ అవగాహన కార్యక్రమాలను జిల్లాలోని అన్ని గ్రామాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధి పట్ల అపోహలు, వివక్ష పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని, వ్యాధిగ్రస్తులను మానవీయ దృక్పథంతో ఆదరించాలని ఆమె కోరారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పిలేని బొడిపెలు, తిమ్మిర్లు, కంతులు, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతులు-కాళ్లలో స్పర్శ కోల్పోవడం



వంటి లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వీఱ మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఇంటింటి సర్వేకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలని, చికిత్స విషయంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ాావజూతీశీంఎ అం జబతీఖఎశ్రీవ అన్న సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఇందుకు సంబంధించిన ప్రతి ఒక్కరూ నిబద్ధత కలిగి విధులు నిర్వహించాలని వైద్య అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. వెంకటేశ్వరరావు, డీఎల్‌ఏటీ ఆఫీసర్ డా. ఎన్. వసుంధర, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసు దేవరావు, ఐసిడిఎస్ పిడి టి.శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, అలాగే ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్షేత్ర సహాయకునిపై విచారణ

**- తప్పు జరిగినట్లు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు**
**- ఏపీడి శ్రీనివాస్ విశ్వనాధ్**





**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని అమీనాబాద్ క్షేత్ర సహాయకుడు తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని రంపచోడవరం ఏపీ డి.శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు.బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అమినాబాద్ ఫీల్డ్ అసిస్టెంట్ దొండ జగదీష్‌ను రంపచోడవరం ద్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ విచారించారు. స్థానిక ఎంపీడీఓ యాదగిరేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశహాలునందు విచారణ నిర్వహించిన శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ అమినాబాద్ క్షేత్రసహాయకులు జగదీష్ ఉపాధిహామీ పథకం అమలులో అవినీతి అక్రమాలు చేస్తున్నారని, తప్పుడు మస్తర్లు వేసి ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తున్నారని పెయ్యాల చిన్ని అనే మహిళా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా ఉన్నత అధికారులు స్పందించి ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ ను విచారణ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు మహిళా చిన్న నుంచి వివరాలు సేకరించి సంబంధిత దస్త్రాలను ఏపీడీ పరిశీలించారు. అనంతరం ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ సాంకేతిక అంశాలు ముడిపడి ఉండడం వలన విచారణ కొనసాగుతుందని త్వరలో పూర్తి నివేదికను ఉన్నతాది ,కారులకు పంపడం జరుగుతుందని అన్నారు. తప్పు జరిగినట్టు నిర్ధారణ అయితే శాఖపరమైన చర్యలుంటాయని అన్నారు.విచారణ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంటుకు అనుకూలంగా, వ్యతిరేకంగా శ్రామికులు, నాయకులు రావడం విశేషం. విచారణ సమయంలో ఏపీడీ రాంబాబు, ఎంపీడీఓ యాదగిరేశ్వరరావు, ఏపీఓలు సురేష్, రాంబాబు, ఏఎంసీ ఛైర్మెన్ లోతా లక్ష్మణరావు, టీడీపీ నాయకులు తాతారావు, పుట్టా బుజ్జి తదితరులు ఉన్నారు.

# లోకేష్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ, ఇన్‌చార్జి కలెక్టర్**
**- సభా ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కొండబాబు, టీడీపీ నేతలు**
**- ఈ నెల 30న కాకినాడకు రానున్న మంత్రి నారా లోకేష్**



**కాకినాడ, సూర్య ప్రతినిధి :** రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 30వ తేదీ శుక్రవారం కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం, ఏర్పాట్లను యుద్ధప్రతిపాదికన పూర్తి చేస్తోంది. బుధవారం జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ మరియు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ కలిసి పర్యటన సాగనున్న ప్రాంతాలను, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఏర్పాట్లపై ప్రత్యేక నిఘా:** ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా అధికారులు కాకినాడ జేఎన్‌టీయూ, కోరమాండల్ హాస్పిటల్ పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం కాకినాడ ఏడీబీ రోడ్డు - పనసపాడు గ్రామ పరిధిలో మెడికవర్ హాస్పిటల్ ప్రక్కన గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని పోలీసు అధికారులకు, కార్యక్రమ నిర్వాహకులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి యేదాసు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పర్యటనకు భారీగా జనసందోహం వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నేతలు అధికారులను కోరారు.

**భారీ పోలీసు బందోబస్తు:** మంత్రి పర్యటన దృష్ట్యా జిల్లా అంతటా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, అదనపు ఎస్పీ ఏఆర్. ఎస్. శ్రీనివాసరావు, డీఎస్పీలు డి.శ్రీహరిరాజు, వి.జి. శ్రీహరిరావు, కె.వి.వి.సత్యనారాయణ, ఇన్స్‌పెక్టర్లు బి.పెద్దిరాజు, ఏ.కృష్ణ భగవాన్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అల్లూరి టోర్నీ విజేత అడ్డతీగల హంటర్స్



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భారీ మెగా అల్లూరి సీతారామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది ఈ టోర్నమెంట్లో ఆడిన అన్ని మ్యాచ్లో విజయం సాధించి ఫైనల్ కు చేరుకున్న అడ్డతీగల కు చెందిన కెప్టెన్ గౌరీశంకర్ నేతృత్వంలోని హంటర్స్ జట్టు ఉత్కంఠ భరత పోరులో రంపచోడవరం బాబిజట్టుపై నాలుగు పరుగులు తేడాతో విజయం సాధించి టైటిల్ ట్రోఫీ కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు 30 వేల రూపాయలు నగదు బహుమతిని అందజేయగా రన్నర్స్ జట్టుకు రోహిత్తో పాటు 20 వేల రూపాయలు ప్రైజ్ మనీ అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు మొదటగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ టోర్నీ నిర్వహణకు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఎప్పుడు ఏమి కావాల న్నా అందుబాటులో ఉంటానని హామీ ఇవ్వడం జరిగిందని టోర్నీ నిర్వాహకుడు బీర బాలయోగి తెలిపారు. బహుమతి ప్రధాన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రామసేతు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు బిజెపి నాయకుడు గోకవరంకి చెందిన కంబాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరవడంతో పాటు ఈ టోర్నీలో నిర్వాహకులకు క్రీడాకారుల అవసరార్థం వినియోగించమని 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది అలాగే సెమీఫైనల్ లో ఓడిపోయిన జట్లకు సైతం 7500 చొప్పున ప్రైజ్ మనీ అందించడం మరియు వ్యక్తిగత బహుమతుల పొందిన క్రీడాకారులకు సైతం వెయ్యి రూపాయలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. అలాగే వేటమామిడి బేస్ విద్యాసంస్థల ఫౌండర్ సందీప్ విజేతలకు అందించే ట్రోఫీ నిమిత్తం 20 వేల రూపాయల ఆర్థిక సహాయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఈ మెగా టోర్నమెంట్ నిర్వహణకు నిర్వాహకుడు బాలయోగి అడ్డతీగల యువత అందర్నీ కలుపుకొని విశేష ప్రాచుర్యం కల్పించడంతో ఎన్నడూ లేని విధంగా భారీగా విరాళాలు రావడంతో టోర్నీ మొత్తం పూర్తయ్యాక తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ అందించిన 50 వేల రూపాయలు మిగలడంతో వాటిని భవిష్యత్తులో ఈ టోర్నమెంట్ నిర్వహణకు వినియోగించే మూలధనంగా స్థానిక బ్యాంకులో క్రీడాకారుల కమిటీ ఏర్పాటు చేసి డిపాజిట్ చేయనున్నట్లు బాలయోగి పేర్కొన్నారు. ఈ విషయం పట్ల అడ్డతీగల మాజీ క్రీడాకారులు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## దళిత యువకులపై దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** గంటి గ్రామంలో దళిత యువకులపై జరిగిన దాడిని నిరసిస్తూ గంటి గ్రామం నుండి కొత్తపేట ఆర్డీఓ కార్యాలయం వరకు దళిత నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. దళిత యువకులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దళిత యువకులపై హత్యాయత్నం చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. నిర్దోషులైన దళిత యువకులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే తొలగించాలి. బాధిత యువకులకు మెరుగైన వైద్యం మరియు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ పి.శ్రీకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరం




**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు పశువుల ఆసుపత్రి వద్ద జనవరి 28వ తేదీ బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఉచిత పశు ఆరోగ్య శిబిరం ప్రారంభించబడింది. జనవరి 19 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు నిర్వహించబడతాయని ఈ శిబిరాల్లో పశువైద్యపు చికిత్సలు, నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహింపబడతాయని డాక్టర్ రుషి ప్రసాద్ అసిస్టెంట్ డైరెక్టర్ నిడదవోలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువులకు మందులు, దాణా పంపిణీ చేశారు. కానూరు గ్రామ సర్పంచ్ బావన మధు పూర్ణచందు, చిట్టూరి వెంకటనారాయణ , కోలా సీతయ్య నాయుడు, రంకిరెడ్డి ప్రసాద్, చోడపు నీడి మూర్తి, బొబ్బిలి దుర్గారావు, డాక్టర్ చరణ్ ఫణీంద్ర పెరవలి , బిహెచ్.రమేష్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కానూరు, నిరంజన్ కుమార్ వెటర్నరీ అసిస్టెంట్‌లు రైతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సాంకేతికత తప్పనిసరి



**పెరవలి, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ విస్తరణ కొరకు సాంకేతికత తప్పనిసరి అని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శాకా రామకృష్ణ అన్నారు. డిసెంబర్ 28వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల ముత్యాల వారి పాలెం గ్రామాలలో డ్రోన్ సహాయంతో సాంకేతిక విధానంలో రబి వరి పంటలపై ప్రకృతి వ్యవసాయ వేప గింజల ఇంగువ, చేపగల ద్రావణం, పిచికారి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ కషాయాలను ద్రావణాలను వరి పంటలపై 40 ఎకరాలకు పిచికారి చేయించడం కొరకు ప్రణాళిక పద్ధతిగా ముందుకు వెళుతున్నాము అని మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ తెలిపారు. వరి పంటలపై పురుగులు తెగులు నియంత్రణ కొరకు వేప గింజల ఇంగువ కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించినట్లు జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. మొదటి విడతగా మండలంలో 3500 ఎకరాలలో ఈ విధంగా పిచికారీ చేసే విధంగా ప్రణాళిక చేసినట్లు తెలిపారు. డ్రోన్స్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దీప్తి మాట్లాడుతూ వరి పంటలపై కాండం తొలిచేపురుగు, రసం పీల్చే పురుగు, ఆకు ముడత, మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వరి పంటలో వచ్చు తెగిళ్ళను నివారించడంలో వేప గింజల కషాయం, చేపల బెల్లం ద్రావణం, ఆర్గానిక్ పొటాషియం వావిలాకు కషాయాలను జీవామృతంతో కలిపి పంటలపై పిచికారి చేయడం వల్ల ఆశించిన దానికంటే అధిక దిగుబడిని పొందవచ్చని గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నల్ల కాశి తెలియజేశారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ కొరకు డ్రోన్ సహాయంతో కషాయాలను రైతుల్లోనికి నేరుగా తీసుకువెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కన్నజి వెంకటకృష్ణ, సూర్యనారాయణ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారాలు

**- ఎంపిడిఓ చేతుల మీదుగా**





**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మండల జెఇవి.వి.సతీష్‌కుమార్, ఎపిఓ డి.సుధీర్‌లకు 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ చేతుల మీదుగా డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ సేవలకు మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పురస్కా రాలు అందుకున్న సతీష్‌కుమార్, ఎపిఓ సుధీర్‌లను ఎన్ఆర్ ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది కర్రి వీరబాబు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

## గ్రామాలలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ వర్క్‌ల ప్రగతిని త్వరతగతిన పూర్తి చేయాలి- ఎంపిడిఓ





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో ఆయా గ్రామాలలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా నిర్వహిస్తున్న పనుల ప్రగతిని బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, ఎపిఓ సుధీర్, జె.ఇ. సతీష్‌కుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి యు.వై.రత్నంలతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ గ్రామాల వారీగా సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బందితో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా నిర్వహిస్తున్న పనుల ప్రగతిని సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు పంచాయతీ రాజ్ ఉద్యోగుల బృందం విస్తరణ కేంద్రం పరిశీలన



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్లోని పంచాయతీల అధ్యయనం కోసం తమిళనాడు పంచాయతీ రాజ్ ఉద్యోగుల బృందం బుధవారం సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రానికి చేరుకుంది. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కే ఎన్ వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఈ బృందం నాలుగు రోజుల పాటు పలు గ్రామాల్లో పర్యటించనుంది. తమిళనాడు రాష్ట్ర శిక్షణ సంస్థ పంపిన 30 మంది తొలిరోజు సామర్లకోట మండలం మేడపాడు గ్రామ పంచాయతీని సందర్శించారు. పంచాయతీ సమావేశాలు, పారిశుధ్యం నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. వీరికి జుజ ఫ్యాకల్టీ సభ్యులు శేషుబాబు, నిహారిక ఇక్కడి గ్రామాల్లోని పాలన తీరును వివరించారు.

-టిఓటిలకు శిక్షణ..రాష్ట్రంలో గ్రేడ్-4,5 పంచాయతీ అభివృద్ధి అధికారులకు శిక్షణ ఇచ్చే టిఓటిలకు సామర్లకోట శిక్షణ కేంద్రంలో బుధవారం తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రామపంచాయతీ పాలనపై మూడు రోజులపాటు వీరు శిక్షణ పొంది, తదుపరి జిల్లాలలో పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలో దాదాపు 10 వేల మంది పంచాయతీ అభివృద్ధి అధికారులకు వచ్చే నెల 2 నుంచి 21 వరకు బ్యాచ్‌ల వారీగా ఈ తరగతులు ఏర్పాటు చేయనున్నారు. ఈ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఎంపిడిఓ సుశీల, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, రాజశ్రీ, రాజ్ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.